ఆపద వేళ అన్నదాతలకు భరోసా

- అండగా నిలబడిన జగన్ ప్రభుత్వం
- ధాన్యం ఆఫ్‌లైన్ కొనుగోళ్లకు అనుమతి

రాజానగరం: అకాల వర్షాలతో అన్నదాతలకు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందుతున్న తరుణంలో ఏర్పడిన ఈ పరిస్థితులతో బెంబేలెత్తుతున్నారు. ఈ ఆపద వేళ వారికి జగన్ ప్రభుత్వం అండగా నిలబడింది. ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారానే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసేందుకు అనుమతించింది. దీనితో ఆర్‌బీకేల సాయంతో సమీపంలోని మిల్లర్లకు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని విక్రయించి, వర్షం నష్టం నుంచి బయట పడేందుకు రైతులు అవకాశం కల్పించింది.

అన్నదాతల ఆవేదన

ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. పండిన పంట కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాలు వచ్చి, అన్నదాతను కంటతడిపెట్టిస్తున్నాయి. ఈదురు గాలులకు పొలాల్లో కోతకు వచ్చిన వరిపంట నేలపై ఒరిగిపోవడం, ఆరుదల కోసం కళ్లాల్లో పోసిన ధాన్యం తడిచి ముద్దడం, ఆరబెట్టిన మొక్కజొన్నలు కళ్లాల్లోనే తడిచిపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితులలో అన్నదాతలు కుమిలిపోతున్నారు.

కళ్లాల్లో తడుస్తున్న ధాన్యం

రబీ సీజన్‌లో నియోజకవర్గంలోని మూడు మండలాలలో 16,750 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. వీటిలో రాజానగరం మండలంలో 70 శాతం మేరకు ప్రస్తుత వర్షాలకు ముందుగానే కోతలు అయిపోయాయి. మిగిలిన ప్రాంతాలతో పాటు కోరుకొండ, సీతానగరం మండలాలో అడపాదడపా జరుగుతున్నాయి. కోరుకొండ మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు కోతలు కోసి, పొలాల్లోనే వరి కుప్పలు వేస్తుంటారు. రాజానగరం మండలంలోని సంపత్ నగరం, కొండగుంటూరు, జి.యర్రంపాలెం, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, తుంగపాడు గ్రామాల్లో వరి కోతలు జరుగుతున్నాయి.



వంగలపూడిలో ఆరబోసిన ధాన్యం

మొక్కజొన్న పరిస్థితీ ఇంతే ..

సీతానగరం మండలంలో మొక్కజొన్న సాగు విస్తీరంగా జరుగుతుంది. ఈ ప్రాంతంలో 10,500 ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న ప్రస్తుతం కోతకు వచ్చింది. ధర కూడా క్వింటాల్‌కు రూ.2,350 వరకు ఉందని సంబరపడిన రైతులు కోసి, ఆరబెట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో విక్రయించేందుకు సిద్ధమవుతుండగా, అకాల వర్షాలు రైతుల ఆశలను నీరుగార్చాయి. వర్షాల ప్రభావంతో ప్రస్తుతం క్వింటాల్ మొక్కజొన్న ధర రూ.1,750కి పడిపోయింది. ధాన్యం మాదిరిగా మొక్కజొన్నలకు ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో సరైన ధర లేక ఇబ్బందులు పడుతున్నారు.



సంపత్‌నగరంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని పోగులేసి, తడవకుండా గడ్డి కప్పిన దృశ్యం

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

కోసిన ధాన్యం పాడవకుండా పొలాల నుంచి నేరుగా మిల్లులకు తరలించేలా ఆఫ్‌లైన్ కొనుగోళ్లకు ప్రభుత్వం సోమవారం నుంచి అనుమతించింది. దీనితో ఆర్‌బీకేల ద్వారా ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. సీతానగరం మండలంలో సుమారు 850 మెట్రిక్ టన్నుల వరకు పొలాల్లో ధాన్యం నిల్వలున్నాయి.

– కేఎస్ రమేష్, వ్యవసాయాధికారి, సీతానగరం మండలం

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



తొర్రేడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం తొర్రేడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి.. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ఇబ్బందులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ నెలలో తొర్రేడులో జరిగే ఓనువులమ్మ జాతరలో అందరూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి ఆరోగ్యవంతమైన జీవనానికి బీటలు వేయాలని కోరారు. కాతేరుకు చెందిన గారపాటి వనజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ మంజూరుపై హర్షం

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి రూ. 215 కోట్ల వాటర్ గ్రిడ్ పథకం మంజూరు చేయడంపై ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం తీసుకువచ్చిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు.

క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడే సత్తెమ్మతల్లి జాతర ప్రారంభం



బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కొలువై ఉన్న పడాల కుటుంబీకుల ఆడపడుచు అయిన సత్తెమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఆలయ కమిటీ సభ్యులు పడాల రామారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర ఐదు రోజుల పాటు ఉంటుందని, ఈ నెల 3వ తేదీతో మొదలై 8వ తేదీతో పూర్తి అవుతుందన్నారు.

అగస్త్యేశ్వరస్వామికి అభిషేకాలు



విశేషాలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

బిక్కవోలు: గ్రామంలో కొలువైయున్న అగస్త్యేశ్వరస్వామికి మంగళవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 110 మంది స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

అనపర్తి: వేమగిరి–సామర్లకోట కెనాల్‌లో మండలంలోని లక్ష్మీనరసాపురం శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అనపర్తి పోలీసులు తెలిపారు. లక్ష్మీనరసాపురం శివారు కొప్పవరం వెళ్లే వంతెన సమీపంలో సుమారు 25–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని కాలువలో మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించి ఏవిధమైన సమాచారం లభించలేదని, కొప్పవరం వీఆర్‌ఓ డి.వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై అబ్బులుదొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తక్షణమే అమ్మకాలు జరుపుకోవచ్చు

సీతానగరం: రాశులపై ఉన్న, బస్తాల పట్టిన ధాన్యాన్ని మిల్లర్లకు తక్షణమే అమ్మకాలు జరుపుకోవచ్చని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చినకొండేపూడిలోని ధాన్యాన్ని గాడాలలోని రైస్‌మిల్లుకు, మిగిలిన గ్రామాల రైతులు రఘుదేవపురంలోని కార్తికేయ, వేంకటేశ్వర రైస్‌మిల్లులకు విక్రయించాలన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ యు.రామన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఈ నెల 4న ఉదయం 10 గంటలకు గోకవరం నుంచి బయలుదేరి 5న గురుపౌర్ణమి రోజున అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షణ అనంతరం విష్ణుకంచి, శివకంచి, శ్రీకాళహస్తి, విజయవాడ దర్శనం అనంతరం 7వ తేదీన తిరిగి గోకవరం చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు ధర రూ.3,200 అని రిజర్వేషన్ కోసం భక్తులు 73829 10258, 73829 10321 నంబర్లకు సంప్రదించాలన్నారు. బుకింగ్ బుధవారం రాత్రితో ముగుస్తుందని, ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మదనగోపాలునికి విశేష పూజలు

- ఘనంగా మహా సంప్రోక్షణ కార్యక్రమాలు



మదనగోపాలస్వామి మహా సంప్రోక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి: పొలమూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీమదన గోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రధాన కర్తలుగా నిర్వర్తించారు. వైఖానస ఆగమ విధానంలో తిరుపతికి చెందిన ప్రొఫెసర్ వేదాంతం విష్ణు భట్టాచార్యులు ఆధ్వర్యంలో నవ కలశ ఆరాధన, ఉక్త హోమం, అధివాస హోమం, జలాధివాసం తదితర కార్యక్రమాలు పూర్తి చేశారు. సాయంత్రం శయనాధివాసం, హౌత్రం, విశేష హోమం, ప్రభూత బలి వైభవంగా జరిపించారు. ఆలయం వద్ద రామచంద్రపురానికి చెందిన అక్కిరాజ్ శ్రీనివాస్ బృందం చేసిన ఆధ్యాత్మిక గీతాలాపన ఆహుతులను అలరించింది. అక్కిరాజ్ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే దంపతులు సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, వ్యాపార వేత్త సత్తి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి కనకారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

బుధవారం ఉదయం 7.18 గంటలకు మహా సంప్రోక్షణ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వేద పండితులు తెలిపారు. ఉభయ దేవేరులతో కూడిన మదన గోపాలస్వామి జయ, విజయ, విష్వక్సేన, వైఖానస మహర్షి, గరుడాళ్వార్, ధ్వజస్థంభ ప్రతిష్ఠలు చేయనున్నట్లు వారు తెలిపారు. అనంతరం మహా అన్న సమారాధన, సాయంత్రం గరుడ వాహన సేవ, రాత్రి శాంతి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం



పందలపాకలో బోల్తా పడిన ధాన్యంలోడు ట్రాక్టర్

బిక్కవోలు: ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ మలుపు తిరుగుతూ బోల్తా పడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. మండలంలోని పందలపాక గ్రామంలో మంగళవారం స్థానిక కోదండరామ రైస్ మిల్లుకు ధాన్యం తరలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ బోల్తాపడ్డ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఆర్డీవో సీతారామారావు

పెదపూడి: రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి కాకినాడ ఇన్‌చార్జి ఆర్డీవో జె.సీతారామారావు పెదపూడి మండలం మామిడాడ రైతు భరోసా కేంద్ర పరిధిలో ధాన్యం నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అధిక వర్షాలు కురుస్తున్నందున రైతులు తాము పండించిన పంటను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా తాము పండించిన పంటకు మద్దతు ధర పొందడానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. ఇందుకు రైతులకు రవాణా, హమాలీ చార్జీలు, గోతాలు అందించనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు పెదపూడి మండలం లో ఏడు వేల హెక్టార్లలో పంట నూర్పిడి జరిగినందున రైతులు వర్షాల బారిన పడకుండా పంటను కాపాడుకోవాలని సూచించారు. పెదపూడి మండలంలో అధిక శాతం బొండాలు సాగు చేస్తున్న నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ సుభాష్, వ్యవసాయ అధికారి మణికుమార్, డిప్యూటీ తహసీల్దార్ రామ్‌కుమార్, ఆర్‌ఐ త్రివేణి ఉన్నారు.

సింగంపల్లిలో మేడే వారోత్సవాలు



సింగంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం సభ్యులు

రంగంపేట: మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో గల సీపీరెడ్డి నగర్‌లో మేడే వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ జెండా ఎగురవేసి, అమర వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కోసం ఆనాడు అమరవీరులు చేసిన త్యాగం ఎనలేనిదని, నేడు కార్మిక చట్టాలను, ప్రజా హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై ఉక్కుపాదం మోపుతోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న జీవన ప్రమాణాలతో నూటికి 90 శాతం ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావట్లేదన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె.సతీష్, చక్కా సత్తిరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం

రాజానగరం: పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వర్రావు అన్నారు. దివాన్ చెరువులోని ఫౌండేషన్ కార్యాలయంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందిన 70 మంది మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు సుంకర వీరాస్వామి, వినీల, అనురాధ, శిక్షకురాలు ఈవూరి దుర్గ పాల్గొన్నారు.

75 ఎకరాల స్వాధీనం



చైత్రవర్షిణి, ఆర్డీఓ

సీటీఆర్ఐ: ఎల్‌ఆర్టీ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని సీతానగరం, కోరుకొండ మండలం మధురపూడి, మునగాల, మిర్తిపాడులో 75.36 ఎకరాలను మే ఒకటో తేదీన సంబంధిత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ అధికారి ఏ.చైత్రవర్షిణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన మద్దిపాటి రాజాచౌదరికి చెందిన మధురపూడిలోని 19 ఎకరాల 72.1/2 సెంట్లు, మునగాలలో 10 ఎకరాల 12 సెంట్లు, మిర్తిపాడు 12 ఎకరాల 74 సెంట్లు, సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన మద్దిపాటి జోగేంద్రనాథ్ చౌదరికి చెందిన మధురపూడిలో 19 ఎకరాల 72. 1/2 సెంట్లు, మునగాలలో 7 ఎకరాల 98 సెంట్లు, మిర్తిపాడు 5 ఎకరాల 07 సెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

11లోగా ఈ-కేవైసీ చేయించుకోండి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఉద్యోగులు ఈ నెల 11వ తేదీ లోగా ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అనపర్తి ఉపఖజానా అధికారిణి దాక్షాయణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ నంబరుతో లింక్ అయిన ఫోన్ నంబరు వెంట తీసుకువస్తే తమ కార్యాలయంలో ఈ-కేవైసీ చేస్తామని ఆమె తెలిపారు.

ఉద్యోగ నియామకపు పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

అనపర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో చదువుతున్న పదిమంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో భాగంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాణరెడ్డి మంగళవారం నియామకపు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రిన్సిపాల్, కాలేజి సిబ్బంది కృషిని అభినందించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: న్యాయస్థానాల్లో కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించేందుకు ఆసక్తి కలవారి నుంచి మీడియేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి మీడియేషన్ అండ్ కన్సీలియేషన్ ప్రాజెక్టు కమిటీ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈనెల నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విశ్రాంత న్యాయమూర్తులు, ఏడేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, వివిధ వృత్తుల్లో 15 ఏళ్ల అనుభవం కలిగిన నిపుణులు అర్హులన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ



సత్యనారాయణకు పింఛను అందిస్తున్న వలంటీరు అప్పలరాజు

రంగంపేట: వెంకటాపురం గ్రామానికి చెందిన సూరంపూడి సత్యనారాయణ(పెంటయ్య) అనారోగ్యం కారణంగా కొంతకాలంగా కాకినాడ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారుడు. ఒకటవ తేదీన పింఛను సొమ్ము అందించడానికి గ్రామ వలంటీరు గోలి అప్పలరాజు ఇంటికి వెళ్లగా ఆసుపత్రిలో ఉన్నారని తెలపడంతో మంగళవారం వలంటీర్ తన సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణకు పింఛను సొమ్ము అందించాడు. దీంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ కారణంగా లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా సమయానికి పింఛను సొమ్ము అందుతోందని సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

అమరవీరులకు నివాళులు



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పెదపూడి: మే డే వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కాకినాడ డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడు ఏల్లే సత్తిబాబు ఆధ్వర్యంలో పెదపూడి శివారు కై కవోలు సెంటర్ వద్ద డివిజన్ ప్రధాన కార్యదర్శి మడికి సత్యం సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం చికాగో అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) జిల్లా కన్వీనర్ వడ్లమూరి మంగాదేవి, డివిజన్ నాయకులు సత్తిబాబు, రెడ్డి బుజ్జి, కాంద్రేగుల కృష్ణ పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

కడియం: మండల పరిధిలోని ధాన్యం కొనుగోళ్లను ఆఫ్‌లైన్‌లో చేపట్టినట్లు తహసీల్దార్ ఎం.సుజాత మంగళవారం తెలిపారు. మండలంలోని రెండు రైసుమిల్లులతో పాటు, పెడపర్తిలోని రైసు మిల్లులకు ఆఫ్‌లైన్‌లో సేకరించిన ధాన్యం రవాణా చేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నూకశాతం కొలిచే యంత్రాన్ని కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. 30 శాతంలోపు నూక ఉన్నప్పటికీ మద్దతు ధర తగ్గించడం జరగదన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



కోరుకొండలో సీఎం జగన్, ఎమ్మెల్యే రాజా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు

మధురపూడి: నియోజవర్గానికి వాటర్ గ్రిడ్ పథకాన్ని తీసుకువచ్చిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను అభినందిస్తూ కోరుకొండ మండలంలో ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే రాజా చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల సచివాలయాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వరిపంటను కాపాడుకుందామిలా..



నందకిషోర్, జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు పనల మీద, కళ్లాల్లో ఉన్న వరిపంట దెబ్బ తింటే రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. నష్ట నివారణకు చేపట్టాల్సిన చర్యలను జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం.నంద కిషోర్ వివరించారు. గింజ గట్టిపడే దశ నుంచి కోతదశలో చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుందన్నారు. నిద్రావస్థ లేనటువంటి రకాలు నీట మునిగితే కంకిపైనే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు.

- మనుషులతో కోత కోసిన పనలు వర్షానికి తడిస్తే, గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50 గ్రా ఉప్పు) పనలపై పడేలా పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి. పొలంలో నీరు లేకపోయినట్లయితే మడిలోనే పనలపై ఉప్పు నీరు చల్లుకోవచ్చు. ఒకవేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- కుప్పవేసే సమయంలో తుపాను వాతావరణం వల్ల పనలు తడిస్తే, కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవాలి.
- నూర్చిన ధాన్యాన్ని 2, 3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక క్వింటాల్ ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవ చేసుకోవాలి.
- పూర్తిగా తడిచి రంగు మారిపోయిన ధాన్యానికి మార్కెట్ పూర్తిగా తగ్గిపోతుంది కనుక, ఇటువంటి ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.

వసతి గృహాల తనిఖీ

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను మంగళవారం తనిఖీ చేశారు. ప్రకాశంనగర్‌లోని కేవీ స్టేట్ హోంను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. అనంతరం బాలసదనాన్ని సందర్శించారు. ఉద్యోగినుల వసతి గృహాన్ని, బాలుర పర్యవేక్షణ గృహాలను పరిశీలించారు. ఎలాంటి న్యాయ సేవలు కావాలన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థకి తెలియజేయాలన్నారు.

యూటీఎఫ్ నిర్మాత రామిరెడ్డి వర్ధంతి

కంబాలచెరువు: యూటీఎఫ్ నిర్మాత, ఎస్‌టీఎఫ్ఐ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దాచూరి రామిరెడ్డి వర్ధంతిని మంగళవారం యూటీఎఫ్ హోమ్‌లో మంగళవారం ఆ సంఘ అధ్యక్షుడు పి.జయకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు, అలుపెరుగని పోరాట పటిమకు దాచురి రామిరెడ్డి మారుపేరన్నారు. ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ పాల్గొన్నారు.

డైట్ విద్యార్థినులకు బహుమతులు



సంతోషి



శ్రీలక్ష్మీప్రియ

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో కుటుంబ విలువలు, సంబంధాలు పెంచే ఉద్దేశంతో రాజమండ్రి పోస్టల్ డివిజన్ ఇటీవల నిర్వహించిన తాతకు, నానమ్మకు, అమ్మమ్మకు లేఖ పోటీలలో కేటగిరి బి విభాగంలో బొమ్మూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) విద్యార్థినులు తమ ప్రతిభ చాటారు. డీఎల్‌ఈడీ రెండో సంవత్సరం విద్యార్థిని సీహెచ్ సంతోషి ద్వితీయ బహుమతిగా రూ.1000, సర్టిఫికెట్, అలాగే ప్రథమ సంవత్సర విద్యార్థిని ఆర్ఎస్‌కే శ్రీలక్ష్మీప్రియ కన్సోలేషన్ బహుమతిగా రూ.250, సర్టిఫికెట్‌ను పొందారు. ప్రిన్సిపాల్ నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం, సీనియర్ అధ్యాపకులు కేవీ సూర్యనారాయణ తదితరులు ఆ విద్యార్థినులను అభినందించారు.